ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
సోమవారం 29 జనవరి 2024


అసంపూర్తిగా సచివాలయ భవనం

నిధులు నై నిర్మాణాలు సై

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

- మూడేళ్లుగా సాగదీస్తున్న పాలకులు
- బిల్లులు రాక కాంట్రాక్టర్ల ఆపసోపాలు
- ప్రభుత్వ ప్రాధాన్య భవనాలపై నిర్లక్ష్యం
- నిధుల కొరతతో ఎక్కడివక్కడే నిర్మాణాలు
- దారి మళ్లిన కేంద్రం ఉపాధి హామీ నిధులు
- 2,740 భవనాలకు 1,227 నిర్మాణాలే పూర్తి

ప్రభుత్వ ప్రాధాన్య భవనాలు.. అయితే నిధులు ఇవ్వకపోవడంతో మూడేళ్లుగా నిర్మాణాలు సా..గుతున్నాయి. విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, బల్క్ మిల్క్ చిల్లింగ్ సెంటర్లు గ్రామాభివృద్ధిలో కీలకమైనవని పాలకులు ప్రకటించారు. ఆర్భాటంగా నిర్మాణాలు చేపట్టారేకాని నిధులు విడుదలలో నిర్లక్ష్యం చేస్తున్నారు. సకాలంలో బిల్లులు రాక కాంట్రాక్టర్లు అపసోపాలతో పనులకు వెనుకంజ వేస్తున్నారు. మూడేళ్లు నిధులు రాక.. నిర్మాణాలు సాగక ఎక్కడ భవనాలు అక్కడే అన్న చందంగా మారాయి. ఉపాధి హామీ పథకం కింద ఆయా భవనాల నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టింది. అయితే కేంద్రం విడుదల చేసిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించింది. దీంతో నిధులకు కొరత ఏర్పడటం.. కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకపోవడంతో ఆయా భవనాల నిర్మాణాలు ముందుకు సాగడం లేదు.

నిధులు కొరత.. పాలకుల నిర్లక్ష్యంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రగతి పనులు ముందుకు సాగడంలేదు. నిధుల కొరతతో విలేజ్ హెల్త్ క్లినిక్, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, బల్క్ మిల్క్ చిల్లింగ్ యూనిట్ల భవనాల నిర్మాణాలు మూడేళ్లుగా సాగదీస్తున్నారు. బిల్లులు చెల్లించకపోవడంతో కొందరు కాంట్రాక్టర్లు భవనాల నిర్మాణాలను నిలిపివేశారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 2,740 భవనాల నిర్మాణం చేపట్టగా ఇప్పటికీ 1,227 భవనాల నిర్మాణాలు పూర్తి అయ్యాయి. గ్రామ స్వరాజ్యం తీసుకు వచ్చేందుకే


పిల్లర్లకే పరిమితమైన రైతు భరోసా కేంద్రం

సచివాలయ వ్యవస్థకు ఏర్పాటు చేసి భవనాలను నిర్మిస్తున్నట్లు ప్రభుత్వం గొప్పగా ప్రకటించింది. అయితే ఆచరణలో అది కనిపించడంలేదు. ఈ పరిస్థితుల్లో పలు గ్రామాల్లో సచివాలయాలను ఇంకా అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. అద్దె చెల్లింపుల్లో జాప్యం జరుగుతుండటంతో ఆయా భవనాల యజమానులు సచివాలయాలను ఖాళీ చేయాలని సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్న సంఘటనలున్నాయి. మూడు జిల్లాల్లో 846 సచివాలయ భవనాల నిర్మాణాన్ని చేపట్టగా ఇప్పటికి 598 భవనాల నిర్మాణం మాత్రమే పూర్తయింది. ఇంకా 248 భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆయూష్మాన్ భారత్ పథకంలో భాగంగా హెల్త్ క్లినిక్‌లను మంజూరు చేసింది. 555 హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాన్ని చేపట్టారు. వీటిలో 276 భవనాల నిర్మాణం పూర్తయింది. 279 భవనాల నిర్మాణం వివిధ దశల్లో ఉంది. ఈ భవనాల నిర్మాణం ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితులు కానరావడంలేదు. ఏపీ అమూల్ ప్రాజెక్టుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నది. రాష్ట్రంలోని సహకార డెయిరీలను కాదని ఇతర రాష్ట్రానికి చెందిన అమూల్ డెయిరీకి అనేకరకాలుగా మేలు చేస్తున్నది. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా బల్క్ మిల్క్ చిల్లింగ్ యూనిట్ల నిర్మాణాలను ప్రభుత్వం గ్రామాల్లో చేపట్టింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో 831 యూనిట్ల నిర్మాణాన్ని చేపట్టారు. ఒక్క భవన నిర్మాణం కూడా పూర్తి కానట్లు పంచాయతీరాజ్ శాఖ నివేదికలు తెలియజేస్తున్నాయి. నెలల తరబడి బిల్లుల చెల్లింపులు జరగకపోతుండటంతో కాంట్రాక్టర్లు మొక్కుబడిగా పనులు చేస్తున్నారు.

అద్దె భవనాల్లోనే ఆర్బీకేలు..

రైతు ప్రయోజనాలు కాపాడేందుకు అంటూ ప్రతి గ్రామంలో ఆర్బీకే(రైతు భరోసా కేంద్రం)లను ఏర్పాటు చేసినట్లు పాలకులు ఊదరగొడుతు న్నారు. అద్దె భవనాల్లో ఏర్పాటు చేసిన ఆర్బీకేలకు కొన్ని నెలలుగా అద్దె చెల్లించడంలేదు. కొన్ని చోట్ల అద్దె చెల్లించాలని కొందరు భరోసా కేంద్రాలకు తాళాలు వేసిన సంఘటనలున్నాయి. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని ఆర్బీకేలకు రూ.కోట్లల్లో అద్దె బకాయిలు ఉన్నాయి. 548 రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలను చేపట్టగా 353 భవనాల నిర్మాణం మాత్రమే పూర్త యింది. ఇంకా 195 భవనాల నిర్మాణం వివిధ దశల్లో ఉంది.

సచివాలయ భవనాలు

జిల్లా	నిర్మాణం	పూర్తి
పల్నాడు	399	279
గుంటూరు	176	137
బాపట్ల	271	164

హెల్త్ క్లినిక్‌ల భవనాలు

జిల్లా	నిర్మాణం	పూర్తి
పల్నాడు	308	162
గుంటూరు	153	59
బాపట్ల	94	55

రైతు భరోసా కేంద్రాల భవనాలు

జిల్లా	నిర్మాణం	పూర్తి
పల్నాడు	321	203
గుంటూరు	79	67
బాపట్ల	148	83

నిర్మాణం పూర్తి కాని హెల్త్ క్లినిక్ భవనం



సభ వేదిక వద్ద జరుగుతున్న ఏర్పాట్లు

నేడే రా.. కదలిరా

- వడ్లమూడిలో బహిరంగ సభ
- లక్ష మంది కోసం విస్తృత ఏర్పాట్లు
- టీడీపీ కేడర్‌కు దిశానిర్దేశం చేయనున్న చంద్రబాబు

పసుపు మయం.. ప్రభల నిర్మాణం

టీడీపీ, జనసేన నేతల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రా కదలి రా బహిరంగ సభకు తరలివచ్చే అభిమానులకు స్వాగతం పలికేందుకు భారీగా ఫ్లెక్సీలు, స్వాగత తోరణాలు, బ్యానర్లను ఏర్పాటు చేశారు. దీంతో నారాకోడూరు నుంచి సభా ప్రాంగణం వరకు రహదారికి ఇరువైపులా పసుపుమయంగా మారింది. వేదిక ప్రాంగణంలో మూడు భారీ బెలూన్లను ఎగురవేశారు. సభా ప్రాంగణం వద్ద క్వారీ తిరునాళ్లను తలపించేలా నారాకోడూరు, చేబ్రోలు టీడీపీ నాయకులు విద్యుత్ ప్రభలను నిర్మిస్తున్నారు. ఏర్పాట్లను ధూళిపాళ్ల నరేంద్రకుమార్, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ, నన్నపనేని రాజకుమారి, శ్రావణ్‌కుమార్, జనసేన నాయకుడు వడ్రాణం మార్కండేయబాబు, ఎమ్మెల్సీ రాజు, కోవెళ్లమూడి నాని, రామాంజనేయులు, నాగూర్ మీరా, మన్నవ సుబ్బారావు తదితరులు పర్యవేక్షించారు.

పొన్నూరుటౌన్(చేబ్రోలు), జనవరి 28: టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికల శంఖారావం రా కదలిరా సభ చేబ్రోలు మండలం వడ్లమూడిలో సోమవారం జరగనున్నది. గుంటూరు పార్లమెంట్ పరిధిలోని పొన్నూరు నియోజకవర్గంలో టీడీపీ


సిద్ధమవుతున్న వేదిక


సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న నరేంద్ర కుమార్, కొనకళ్ల నారాయణ, రాజకుమారి తదితరులు

నాయకులు భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆధ్వర్యంలో రా కదలి రా సభకు విస్తృతంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సభ ద్వారా మరో 70 రోజుల్లో జరిగే సార్వత్రిక ఎన్నికలకు టీడీపీ కేడర్‌ను సన్నద్ధం చేసేలా సభా ఏర్పాట్లను చేస్తున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో తొలి సారిగా వడ్లమూడిలో చంద్రబాబు రా కదలి రా బహిరంగ సభ ద్వారా పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేయనున్నారు. క్వారీ దేవాలయానికి సమీపంలో బహిరంగ సభ నిర్వహిస్తుండటంతో మహా శివరాత్రి ముందే వచ్చిందా అన్నట్లు ఆ ప్రాంతంలో కోలాహల వాతావరణం నెలకొంది. 32 ఎకరాల సువిశాల ప్రాంగణంలో సభకు ఏర్పాట్లు చేశారు. పొన్నూరు, ప్రత్తిపాడు, తెనాలి, మంగళగిరి, తాడికొండ, గుంటూరులతో పాటు వేమూరు, రేపల్లె, బాపట్ల తదితర నియోజకవర్గాల నుంచి జనసమీకరణకు నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే రా కదలి రా బహిరంగ సభా వేదికకు ఎన్టీఆర్ సభా ప్రాంగణంగా పేరు పెట్టారు. వంద మంది అతిథులు ఆశీనులయ్యేలా వేదిక నిర్మాణం చేపట్టారు. సభా స్థలికి చేరుకునే మార్గాన్ని సిద్ధం చేశారు. వీఐపీల రాక కోసం సభ స్థలి వెనుక వైపుగా క్వారీ దేవాలయం నుంచి ప్రత్యేకంగా మార్గాన్ని ఏర్పాటు చేశారు. మహిళలు, పురుషుల కోసం వేర్వేరుగా గ్యాలరీలను ఏర్పాటు చేశారు. సభకు వచ్చే ప్రజల కోసం మంచినీరు, మజ్జిగ, ఇతర ఆహార పదార్థాలను సిద్ధం చేస్తున్నారు. అలాగే క్వారీ సమీపంలో హెలిప్యాడ్ సైతం సిద్ధమైంది. ఒక్కో నియోజకవర్గ ఇన్‌చార్జి 50 బస్సులు, 100 కార్లు, 1000 ద్విచక్ర వాహనాలు సిద్ధం చేసుకున్నారు. జిల్లాలో నెలకొన్న పరిస్థితుల రీత్యా అంచనాలకు మించి సభకు జనం భారీగా హాజరయ్యే అవకాశం ఉన్నట్లు నాయకులు తెలిపారు.

వైసీపీ కండువా కప్పుకోలేక ఆత్మహత్య



- పోలీసు వేధింపులతో మత్స్యకారుడి బలవన్మరణం
- వెల్దుర్తి పోలీస్‌స్టేషన్ వద్ద మృతదేహంతో బంధువుల ఆందోళన
- ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలని టీడీపీ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి డిమాండ్

వెల్దుర్తి, జనవరి 28: వైసీపీ కండువా కప్పుకోవాలని.. రూ.2 లక్షలు ఇవ్వాలని.. పదేపదే పోలీసులు వేధించారు. వారి వేధింపులు తాళలేక చవిటిపల్లి దుర్గారావు(38) ఆత్మహత్య చేసుకున్నాడు. దుర్గారావు బలవన్మరణానికి పోలీసులే కారణం.. అంటూ మండలంలోని బంగారుపెంట తండాకు చెందిన దుర్గారావు కుటుంబసభ్యులు ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం మృతదేహంతో వెల్దుర్తి పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. వీరి ఆందోళనకు టీడీపీ మాచర్ల ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి సంఘీభావం తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలు.. కృష్ణానదిలో చేపల వేట వేస్తూ చవిటిపల్లి దుర్గారావు(38) జీవనం సాగించేవాడు. గత నెలలో అతడిపై అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడని పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు నిమిత్తం దుర్గారావు హైకోర్టు నుంచి బెయిల్ తెచ్చుకున్నాడు. అయినా ప్రతి ఆదివారం స్టేషన్‌కు వెళ్లి సంతకం


దుర్గారావు మృతదేహంతో రోడ్డుపై ధర్నా చేస్తున్న బ్రహ్మారెడ్డి, మృతుని కుటుంబసభ్యులు

చేసే క్రమంలో పోలీసులు వేధిస్తున్నారని మానసిక వేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున చేపలవేటకు బోటులో కృష్ణానదిలోకి వెళ్లాడు. బోటులో ఉన్న తాడుతో ఉరివేసుకుని నదిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. బోటు ఒకేచోట తిరుగుతుండడాన్ని గమనించిన మత్స్యకారులు అక్కడకు వెళ్లి చూడగా దుర్గారావు కనిపించలేదు. బోటుకు ఉన్న తాడును పైకి లాగగా నిర్జీవస్థితిలో దుర్గారావు ఉన్నాడు. మృతదేహాన్ని నది నుంచి బయటకు తీసి మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అతడికి భార్య ధనలక్ష్మి, ముగ్గురు సంతానం ఉన్నారు. పోలీసుల వేధింపులు తాళలేకనే దుర్గారావు చనిపోయాడని, తమకు న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు వేడుకున్నారు.

ఎస్‌ఐపై కఠిన చర్యలు తీసుకోవాలి: బ్రహ్మారెడ్డి

దుర్గారావు మృతికి కారణమైన వెల్దుర్తి ఎస్‌ఐపై కఠిన చర్యలు తీసుకోవాలని జూలకంటి బ్రహ్మారెడ్డి డిమాండ్ చేశారు. దుర్గారావు మృతదేహంతో బంధువులు పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న విషయం తెలిసిన వెంటనే బ్రహ్మారెడ్డి అక్కడ కు చేరుకుని వారికి సంఘీభావం ప్రకటించారు. మృతుడి భార్య ధనలక్ష్మి, కుటుంబసభ్యులను ఓదార్చారు. అనంతరం మృతదేహంతో నడిరోడ్డుపై కూర్చొని ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ దుర్గారావు చేపల వేటకు వెళ్లినప్పుడు ప్రమాదవశాత్తూ తాడు మెడకు చుట్టుకుని చనిపోయినట్లు పోలీసులు కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. వెల్దుర్తి ఎస్‌ఐ ఎంతమందిపై అక్రమ కేసులు బనాయించారో, ఎందరిని హింసించారో అధికారులు, మీడియా ముఖంగా చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. కొట్టడం, దూర్భాషలాడడం, డబ్బులు గుంజడం, పార్టీ మారాలంటూ బెదిరించడం నియోజకవర్గంలో పరిపాటిగా మారిందన్నారు. ఉన్నతాధికారులు నిష్పక్షపాతంగా దుర్గారావు మృతిపై విచారణ జరిపి ఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలన్నారు. దుర్గారావు కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుంద న్నారు. మృతుడి కుటుంబానికి పార్టీ తరపున రూ.4 లక్షలు అందించనున్నట్లు చెప్పారు. టీడీపీ అధికారంలోకి రాగానే దుర్గారావు పిల్లల విద్యాభ్యాసం తోపాటు కుటుంబ బాధ్యతను టీడీపీ తీసుకుంటుందన్నారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం కోటి రూపాయలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

విచారించి చర్యలు తీసుకుంటాం: డీఎస్పీ పల్లపు రాజు

దుర్గారావు మృతిపై విచారించి చర్యలు తీసుకుంటామని గురజాల డీఎస్పీ పల్లపురాజు తెలిపారు. మృతుడి బంధువులు వెల్దుర్తి పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న విషయం తెలుసుకుని అక్కడకు చేరుకుని మృతుడి బంధువులు, బ్రహ్మారెడ్డితో చర్చించి వారి నుంచి డీఎస్పీ ఫిర్యాదు తీసుకున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.


డీఎస్పీ పల్లపురాజుకు ఫిర్యాదు అందిస్తున్న బ్రహ్మారెడ్డి, మృతుని భార్య ధనలక్ష్మి

పోటీకి రంగం సిద్ధం

- లోక్‌సభ వైసీపీ అభ్యర్థిగా అనీల్‌కుమార్ ఖరారు
- నరసరావుపేటలో కార్యాలయ భవనాల పరిశీలన

నరసరావుపేట, జనవరి 28: నరసరావుపేట పార్లమెంట్‌కు వైసీపీ నుంచి పోటీకి మాజీ మంత్రి, నెల్లూరు ఎమ్మెల్యే అనీల్‌కుమార్‌యాదవ్ సిద్ధమయ్యారు. నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థిగా వైసీపీ అధిష్ఠానం అనీల్ కుమార్ పేరును ఖరారు చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి స్వయంగా ఆయనతో చర్చించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో నరసరావుపేటలో కార్యాలయం, నివాస భవనాల కోసం ఆయన ముఖ్య అనుచరులు పరిశీలించారు. పల్నాడు రోడ్డులోని వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడి స్థలంలోని పార్టీ జిల్లా కార్యాలయాన్ని అనీల్‌కుమార్ కార్యాలయానికి ఎంపిక చేసుకున్నట్లు తెలిసింది. వైసీపీ నాయకుడికి సంబంధించిన ఓ భవనాన్ని ఆయన నివాసం కోసం పరిశీలించినట్లు నేతలు చెబుతున్నారు. బీసీ కార్డు ప్రయోగించేందుకే అనీల్‌ను పోటీలో దింపుతున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే ఆయన నియోజకవర్గంలోని ముఖ్య నేతలతో టచ్‌లో ఉన్నట్లు తెలిసింది. కొందరూ ఎమ్మెల్యేలతో కూడా తన పోటీపై చర్చించినట్లు సమాచారం. ఊహించని పరిణామాలు చోటు చేసుకుంటే తప్ప అనీల్ పార్లమెంట్ అభ్యర్థిగా బరిలో దిగడం ఖాయమని వైసీపీ పెద్దలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎక్కడ నుంచి పోటీ చేయమంటే అక్కడ నుంచి పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని, ఈ నేపథ్యంలో తనను నరసరావుపేట నుంచి పోటీకి ఆదేశించారని అనీల్ కుమార్ ఇప్పటికే ప్రకటించిన విషయం తెలిసిందే.

వీధి దీపాలు తీసేశారు.. ఆపై రాళ్లతో దాడి చేశారు

- పథకం ప్రకారం మాజీ మంత్రి కన్నాపై దాడి
- తృటిలో తప్పించుకున్న కన్నా
- దాడిలో ముగ్గురికి గాయాలు
- పల్నాడు జిల్లా తొండపిలో ఘటన

లోపలి పేజీల్లో..


సదస్సులో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

టీడీపీ అంటే బీసీల పార్టీ

- బీసీలను బలహీనపరుస్తున్న జగన్
- రాజకీయంగా, ఆర్థికంగా వడ్డెరలకు అండ
- వడియరాజ్ సదస్సులో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు

నరసరావుపేట టౌన్, జనవరి 28: టీడీపీ అంటే బీసీల పార్టీ అని దేశవ్యాప్తంగా గుర్తింపు ఉందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజ నేయులు తెలిపారు. ఆదివారం నరసరావుపేటలోని బత్తిన గార్డెన్స్‌లో టీడీపీ వడియరాజ్ సాధికార సమితి ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా వడియరాజ్ చైతన్య సదస్సు జరిగింది. తొలుత ఎస్‌ఎస్‌ఎన్ కళాశాల నుంచి ఎస్‌ఆర్‌కేటీ కాలనీ వరకు ర్యాలీ జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన సదస్సులో జీవీ మాట్లాడుతూ బీసీలను గౌరవించిన పార్టీ తెలుగుదేశమన్నారు. బీసీలను బలహీనపర్చాలని జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చూడటం దారుణమన్నారు. 26 వేలమంది బీసీల మీద రాష్ట్రంలో తప్పుడు కేసులు పెట్టి వైసీపీ ప్రభుత్వం వేధిస్తుందన్నారు. వడ్డెరల సామాజికవర్గం ఆత్మాభిమానం కలిగినదని, కష్టజీవులుగా, నిజాయితీ పరులుగా సమాజంలో గుర్తింపు ఉందన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి వడ్డెరలు పార్టీకి అండగా ఉన్నారన్నారు. వడ్డెరల కష్టాలు తెలుసు కోవడానికి చంద్రబాబు సత్యపాల్ కమిటీ వేశారని, కానీ సీఎం జగన్ 300 మందిని అతికిరాత కంగా చంపించారన్నారు. 2018లో చంద్రబాబు వడ్డెర కార్పొరేషన్ పెట్టి రూ.145 కోట్లు ఇచ్చారని గుర్తు చేశారు. ఎన్టీఆర్ వడ్డెరలకు క్వారీలు ఇస్తే వైసీపీ ప్రభుత్వం వాటిని బినామీ పెత్తందారులకు కట్టబెట్టిందన్నారు. రాబోయే టీడీపీ, జనసేన ప్రభుత్వంలో సత్యపాల్ కమిటీ సిఫార్సులను అమలు చేసి వడ్డెరల సంక్షేమానికి కృషి చేస్తామని చెప్పారు. రాజకీయంగా, ఆర్థికంగా వడ్డెర సంఘం ముందుకు వెళ్లడానికి టీడీపీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, టీడీపీ నరసరావుపేట, మాచర్ల ఇన్ చార్జిలు డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తురకా వీరాస్వామి, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటస్వామి, నాయకులు గోనుగుంట్ల కోటేశ్వరరావు, డాక్టర్ కడియాల లలిత్‌సాగర్, తస్నీర్ ఆంజనేయులు, సుబ్బారావు, తాళ్ళూరి వెంకటేశ్వరరావు, దేవళ్ళ సాంబ, వడ్డెర సంఘ పల్నాడు జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, టీడీపీ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బత్తుల రాంబాబు, నరసరావుపేట పార్లమెంట్ మహిళా అధ్యక్షురాలు దాసరి ఉదయశ్రీ, తిరుమలకొండ నరసింహారావు, టీడీపీ వడియరాజ్ సాధికారసమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే వెంకట్, టీడీపీ వడ్డెర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవెళ్ళ మురళి, గురుమూర్తి, జోనల్-3 కో ఆర్డినేటర్ రమాదేవి, జనసేన రాష్ట్ర అధికారప్రతినిధి ఆర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.



నవజాత శిశు సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ బాబురావు

కనుమూరి హాస్పిటల్‌లో
నవజాత శిశు సంరక్షణ కేంద్రం ప్రారంభం

గుంటూరు (మెడికల్) జనవరి 28: గుంటూరు కొత్తపేటలోని కనుమూరి హాస్పిటల్‌లో నవజాత శిశువులకు ప్రత్యేక సంరక్షణ కేంద్రం నియోనేటల్ సెంటర్ వెల్ బేబీని ఆదివారం ప్రముఖ వైద్యులు డాక్టర్ గడ్డిపాటి బాబురావు, డాక్టర్ మామిళ్లపల్లి మధుసూదనరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోనేటాలజిస్ట్ డాక్టర్ ఏవీఎన్ రాజు మాట్లాడుతూ నెలలు నిండకుండా పుట్టి, అతి తక్కువ బరువు కలిగిన శిశువుల వైద్యానికి సంబంధించి అత్యాధునిక పరికరాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. గుంటూరులో మొదటిసారిగా వెంటిలేటర్‌పై ఉన్న ఆక్సిజన్ అందని నవజాత శిశువులకు ఇనిహేల్డ్ నైట్రిక్ ఆక్సైడ్ పరికరం అందుబాట్లోకి తెచ్చినట్లు చెప్పారు. నవజాత శిశువులకు అవసరమైన శస్త్రచికిత్సలు నిర్వహించే సదుపాయాలు ఉన్నాయన్నారు. ఇంక్యుబేటర్, ట్రాన్స్‌పోర్ట్ వెంటిలేటర్ వంటి అధునాతన వైద్య పరికరాలు ఉన్న అంబులెన్స్ కూడా సమకూర్చామని డాక్టర్ రాజు వెల్లడించారు. కనుమూరి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కనుమూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ నవజాత శిశువులకు సంభవించే పలు రకాల శ్వాసకోశవ్యాధుల నిర్ధారణకు, చికిత్సకు అవసరమైన నియోనేటల్ బ్రాంకోస్కోపీ గుంటూరులోనే మొదటిసారిగా తమ ఆసుపత్రిలో సమకూర్చినట్లు తెలిపారు. ఎన్ఐసీయూ వార్డులో 24 గంటలూ వైద్యనిపుణులు అందుబాట్లో ఉంటారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.30 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	116, 124, 135
చికెన్ విత్ స్కిన్	218.00
చికెన్ స్కిన్ లెస్	228.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



నాయీబ్రాహ్మణ భరోసా చంద్రన్న కార్డులను అందజేసి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

వైసీపీ పాలనలో నాయీబ్రాహ్మణులకు తీరని అన్యాయం

● నాయీబ్రాహ్మణ ఫెడరేషన్ మాజీ చైర్మన్ గుంటుపల్లి

పిడుగురాళ్ల, జనవరి 28: వైసీపీ పాలన అధికారంలోకి వచ్చాక నాయీబ్రాహ్మణులకు తీరని అన్యాయమే జరిగిందని రాష్ట్ర నాయీబ్రాహ్మణ ఫెడరేషన్ మాజీ చైర్మన్ గుంటుపల్లి నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నాయీబ్రాహ్మణ నమ్మకం నీవే చంద్రన్న అంటూ జాతీయ నాయీబ్రాహ్మణ సవితా సమాజం, నాయీబ్రాహ్మణ సాధికార కమిటీ విడుదల చేసిన గ్యారంటీ కార్డులను ఇటీవల నియోజకవర్గస్థాయిలో పిడుగురాళ్లలో యరపతినేని అందజేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్నప్పుడు బీసీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ద్వారా రిజిస్టర్ అయిన నాయీబ్రాహ్మణులకు కార్పొరేషన్ ద్వారా లక్ష సబ్సిడీ రుణంతో పాటు జీవనోపాధికి అవసరమైన వాయిద్య పరికరాలు అందజేయడంతో పాటు కళాకారులకు ఐడీ కార్డులు ఇవ్వడం ద్వారా నాయీబ్రాహ్మణులకు సంగీత పాఠశాలలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మహిళలకు టైలరింగ్, ఫ్యాషన్ డిజైన్, బ్యూటీషియన్ ట్రైనింగ్ సెంటర్‌లను ఏర్పాటు చేయడమే కాకుండా దేవాలయాల్లో పనిచేసే నాయీబ్రాహ్మణ వృత్తిదారులకు ఆదరణ పథకం అమలు చేయడం జరిగిందన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక 56 నెలల్లో నాయీబ్రాహ్మణులకు కార్పొరేషన్ ద్వారా 56 పైసలు కూడా అందివ్వకపోగా నాయీబ్రాహ్మణ సహకార సంఘాన్ని కూడా కొత్తగా రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో లక్షలాది మంది నాయీబ్రాహ్మణులకు చెందాల్సిన పలు పథకాలు, రాయితీలు పొందలేకపోయారన్నారు. ఈ సమావేశంలో మాచర్ల హనుమంతరావు, దాచేపల్లి ప్రసాద్, బ్రహ్మం, నెమలికంటి కొండలు, పత్తిపాటి హరికృష్ణ, మాచర్ల నాగేశ్వరరావు, మొక్కరాల నాగేశ్వరరావు, నాగయ్య, శేషగిరిరావు పాల్గొన్నారు.

వైసీపీని ఓడించేందుకు ప్రజలు సిద్ధం

● మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్

బెల్లంకొండ, జనవరి 28 : జగన్‌మోహన్‌రెడ్డికి కౌంట్ డౌన్ డౌన్ మొదలైందని, వైసీపీని ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ఇక మిగిలింది 74 రోజులు మాత్రమేనని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ వైసీపీ దురాగతాలకు ప్రజా కోర్టులో శిక్ష పడే సమయం ఆసన్నదమైందన్నారు. ఎన్నికలకు తాము సిద్ధంగా ఉన్నామని ముఖ్యమంత్రి, వైసీపీ నేతలు చెబుతుంటే మరో వైపు ప్రజలు కూడా వారిని ఓడించేందుకు సిద్ధంగా ఉన్నారని సూచించారు. వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలికేందుకే రైతులు, యువత, ప్రభుత్వ ఉద్యోగులు అంతా సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్నికల తరువాత వైసీపీ జెండా కనుమరుగవుతుందని, ఆంధ్ర రాష్ట్రాన్ని పూర్తిగా నాశనం చేసిన పార్టీ వైసీపీ అన్నారు. ఐదు సంవత్సరాల వైసీపీ ప్రభుత్వం కనీసం ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చేయలేదని, టీడీపీ అధికారంలో ఉండి ఉంటే సాగు నీటి ప్రాజెక్టులన్నీ పూర్తయ్యేవని అన్నారు. కొత్త పన్నులు వేసి, ధరలు పెంచి ప్రజా రక్తాన్ని గల గలా పీల్చి వేస్తున్నారని విమర్శించారు. మద్యం, నిత్యవసర వస్తువుల ధరలు, ఆర్టీసీ, విద్యుత్ చార్జీలు పెంచుతూ సామాన్య మానవుడు బతికే పరిస్థితుల్లో లేరని ఆయన అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సర్పంచ్ జ్యోతిసముద్రం, మండల బీసీ సంఘం అధ్యక్షుడు గుంజా గంగారావు, సలాం, సయ్యద్ జబ్బార్, పీఎస్‌కే రసూల్, గుడిసె కొండయ్య, ఓర్సు రాంబాబు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ వస్తేనే మహిళలకు రక్షణ

● టీడీపీ పట్టణ తెలుగు మహిళా అధ్యక్షురాలు చల్లగుండ్ల



బాబు ష్యూరిటీ - భవిష్యత్‌కు గ్యారంటీ కార్డులను అందజేస్తున్న తెలుగు మహిళా అధ్యక్షురాలు చల్లగుండ్ల సీత తదితరులు

పిడుగురాళ్ల, జనవరి 28 : రాష్ట్రంలో టీడీపీ అధికారంలో ఉంటేనే మహిళలకు రక్షణ కలుగుతుందని టీడీపీ పట్టణ తెలుగు మహిళా అధ్యక్షురాలు చల్లగుండ్ల సీత తెలిపారు. ఆదివారం పట్టణ పరిధిలోని 5వ వార్డులో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించి పథకాల గురించి మహిళలకు వివరించారు. టీడీపీ అధికారంలోకి వస్తే ప్రతి సంక్షేమ పథకానికి మహిళనే అర్హులను చేస్తూ తగిన గౌరవం లభించడం చంద్రబాబుతోనే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జొన్నలగడ్డ లక్ష్మీ, వున్నం లింగావతి, కోమటినేని లక్ష్మీ, వున్నం భారతి, దియ్యా విజయ, శారద, చల్లా అంజమ్మ, కందిమళ్ల శ్రీను, సునీల్, నాగరాజు, శ్రీకాంత్, కుమార్, వీరాంజనేయులు, హరికృష్ణ పాల్గొన్నారు.

ఏపీయూడబ్ల్యూజే కార్యవర్గ ప్రమాణ స్వీకారం

● హాజరైన ఎమ్మెల్యే పీఆర్కే, టీడీపీ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి

మాచర్ల, జనవరి 28: ఏపీయూడబ్ల్యూజే మాచర్ల నియోజకవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం పట్టణంలోని వీవీఎన్ గార్డెన్స్‌లో జరిగింది. ముఖ్య అతిధులుగా ప్రభుత్వ విప్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాచర్ల శాసనసభ్యుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, టీడీపీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డిలు వేర్వేరుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పీఆర్కే మాట్లాడుతూ పాత్రికేయుల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. పాత్రికేయులు ప్రతి ఒక్కరికీ ఇంటి పట్టా అందిస్తామని హామీనిచ్చారు. బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో పాత్రికేయులు స్వేచ్ఛగా వార్తలు రాయగలిగే అవకాశం రావాలని ఆకాంక్షించారు. టీడీపీ అధికారంలోకి రాగానే పాత్రికేయుల అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ఐవి సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి చందూ జనార్ధన్, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు యేచూరి శివ నియోజకవర్గ అధ్యక్షునిగా కొత్తమాసు శ్రీరామ్మూర్తిచే ప్రమాణ స్వీకారం చేశారు.

అర్హులందరికీ ఇళ్లస్థలాలు : ఎమ్మెల్యే కాసు

దాచేపల్లి, జనవరి 28: అర్హులందరికీ ఇళ్లస్థలాలను అందజేస్తామని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. దాచేపల్లి నగర పంచాయతీలో ఆదివారం ఆయన పర్యటించారు. నగర పంచాయతీలోని అన్ని వార్డుల్లో పర్యటించి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కాసు మాట్లాడుతూ సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి పథకాలను కూడా ప్రజలకు చేరువ చేసేలా చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆయా కార్యక్రమాలలో మూలగుండ్ల ప్రకాష్ రెడ్డి, మునగా పున్నారావు, కొప్పుల సాంబయ్య, కోట కృష్ణ, టమాట సుభాని, మందపాటి రమేష్‌రెడ్డి, ఎంపీపీలు జయశ్రీ, కందుల జాను, తదితర నాయకులు పాల్గొన్నారు.

గంధ మహోత్సవంలో ఎమ్మెల్యే పీఆర్కే

రెంటచింతల, జనవరి 28 : మండలంలోని తుమ్మకోటలో ఆదివారం రాత్రి ప్రారంభమైన సైదావలిసాహెబ్ దర్గాకు సంబంధించి గంధ మహోత్సవంలో ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. దర్గా వద్ద గంధం, దట్టి సమర్పించారు. గుర్రాల ఊరేగింపు ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే పీఆర్కే మాట్లాడుతూ తుమ్మకోట లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించి ప్రతిపాదనలు ప్రభుత్వం వద్ద ఉన్నాయని, అమలులోకి వస్తే 2 వేల ఎకరాలకు సాగునీటి సౌకర్యం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ఎస్.నర్సిరెడ్డి, మాజీ జడ్పీటీసీ ఎస్.భాస్కర్‌రెడ్డి, పోట్ల ముత్తయ్య, శ్రీనివాసరావు, వైసీపీ మండల కన్వీనర్ గొట్టం బ్రహ్మారెడ్డి, జిల్లా జేసీఎస్ కన్వీనర్ మోర్తాల ఉమ, వైసీపీ మాజీ కన్వీనర్ పూజల రామయ్య, మహ్మద్ షరీఫ్, సైదావలి, కారంపూడి సైదా, జానీ బాషా, సుభాని, ఎంపీటీసీలు జానీబాషా, సైదా, పఠాన్ సైదావలి, పోట్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పీఆర్కే ఆర్థికసాయం

మాచర్ల రూరల్, జనవరి 28: పట్టణంలోని 31వ వార్డులో ఆదివారం గెల్లిపోగు మరియదాసు మృతి చెందారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వార్డుకు చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్ల వైర్ల అపహరణ

రెంటచింతల, జనవరి 28 : మండలంలోని మిట్టగుడిపాడు గ్రామ పొలాల్లో విద్యుత్ మోటార్ల వైరు అపహరణకు గురవుతూనే ఉన్నాయి. శనివారం రాత్రి గ్రామానికి చెందిన మీరావలి అనే రైతు బోర్‌కు సంబంధించిన 20 మీటర్ల వైర్‌ను కోసి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. దీని విలువ సుమారు రూ.2 వేల వరకు ఉంటుందన్నారు. ఇటీవలి కాలంలో షేక్ సైదు హుస్సేన్, మంచి సత్యం, కళ్లం రామిరెడ్డి, చిన్న పిచ్చిరెడ్డి తదితర రైతులకు చెందిన బోర్ మోటార్ల వైర్‌ను దొంగిలించారు. గతంలో ఇలాంటి సంఘటనలు జరగ్గా చోరీ చేసిన వైర్‌ను పిడుగురాళ్లలోని ఓ దుకాణంలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

వైభవంగా రథోత్సవం

● హాజరైన వేలాది మంది భక్తులు
● పూజల్లో పాల్గొన్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కాసు
● ప్రత్యేక పూజలు నిర్వహించిన చినజీయర్‌స్వామి



శ్రీ ప్రసన్నాంజనేయస్వామి రథోత్సవం, హాజరైన భక్తులు

పిడుగురాళ్ల, జనవరి 28: పిడుగురాళ్ల శ్రీ ప్రసన్నాంజనేయస్వామి రథోత్సవం ఆదివారం కన్నుల పండువగా జరిగింది. స్థానిక ప్రజాశక్తి నగర్‌లో ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ 17వ వార్షికోత్సవం సందర్భంగా గత నాలుగు రోజులుగా పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. చివరి రోజు ఆదివారం సీతారాముల కల్యాణం శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజీయర్‌స్వామి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. అనంతరం చినజీయర్‌స్వామి మాట్లాడుతూ ప్రతి మనిషి తప్పు చేయడానికి భయపడాలని, చేస్తే అది వెన్నంటి వుంటుందనే భయముంటేనే తప్పు చేయకుండా వుంటే స్వర్గప్రాప్తి కలుగుతుందన్నారు. దేశమంతా శ్రీరామ జపం చేస్తుందని, అలా చేస్తేనే దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. రాముల వారి ప్రియభక్తుడైన ఆంజనేయస్వామికి పిడుగురాళ్లలో అతిపెద్ద పండుగ, రథోత్సవం జరుపడం సంతోషమన్నారు. సీతారాముల కల్యాణ విశిష్టతను వివరించారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలతో పాటు ఎంఎల్‌సి జంగా కృష్ణమూర్తి తనయుడు పిడుగురాళ్ల జడ్పీటీసీ వెంకట కోటయ్య స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కూడా స్వామివారిని దర్శించుకొని రథోత్సవాన్ని ప్రారంభించారు. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ప్రారంభమైన రథోత్సవం పట్టణ ప్రధాన రహదారిలో కొనసాగింది. వేలాది మంది భక్తులు, మహిళలతో దేవాలయ ప్రాంగణంతో పాటు రహదారి మొత్తం కిక్కిరిసింది. రథోత్సవానికి, ఉత్సవ మూర్తుల విగ్రహాల ఊరేగింపునకు దారి పొడవున భక్తులు, మహిళలు కోలాట ప్రదర్శనలు చేస్తూ హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వేలాది మందికి దేవాలయం వద్ద మహాఅన్నదాన కార్యక్రమం జరిగింది. చలువాది ఫౌండేషన్ తరుపున ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ, మంచినీటి పంపిణీ కేంద్రాన్ని గురజాల డీఎస్పీ పళ్లంరాజు ప్రారంభించి భక్తులకు అందజేశారు. ప్రముఖ వ్యాపారి కనిగిరి శ్రీనివాసరావు భక్తులకు అవసరమైన మంచినీటి బాటిల్స్, ప్యాకెట్లను వేలాదిగా అందించారు. అదేవిధంగా పట్టణ కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పానకం పంపిణీ చేశారు. రథోత్సవం స్వామివారి దేవాలయం నుండి ప్రారంభమై ప్రధాన రహదారి గుండా ఆంధ్రాబ్యాంక్ సెంటర్ వరకు కొనసాగి తిరిగి దేవాలయం వరకు నిర్వహించారు. రథోత్సవాన్ని పురస్కరించుకొని గురజాల డీఎస్పీ పళ్లంరాజు, పట్టణ సీఐ వీరాంజనేయులు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకున్నారు. దేవాలయ కమిటీ అధ్యక్షులు కాకుమాను మల్లికార్జునరావు, ఆముదాల చినగంగాధరరావు, భవిరిశెట్టి శ్రీను, కాకుమాను గోపాల్‌రావుతో పాటు కోట హరినారాయణ, కొత్త రఘురామయ్య, కట్టమూరి శంకరరావు, పసుమర్తి సుబ్రహ్మణ్యం, జూలకంటి సుబ్రహ్మణ్యం, గుండా నారాయణ, కొమ్మినేని రామచంద్రరావు, విప్పర్ల నాగాచారి, తదితరులు సహాయ సహకారాలు అందజేశారు.



సీతారాముల కల్యాణ మహోత్సవంలో ఉపన్యసిస్తున్న చినజీయర్‌స్వామి



గాయపడ్డ పీఆర్వో స్వామిని ఆస్పత్రిలో పరామర్శిస్తున్న కన్నా తదితరులు

కన్నా దెబ్బకు వైసీపీ వెన్నులో వణుకు

● డీఎస్పీ ఆదినారాయణను తక్షణమే సస్పెండ్ చేయాలి
● టీడీపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రాష్ట్ర నాయకుల డిమాండ్

సత్తెనపల్లి, జనవరి 28 : సత్తెనపల్లిలో కన్నా ఆధ్వర్యంలో టీడీపీలోకి వైసీపీ నేతలు భారీగా వలసలు రావడంతో రాష్ట్రంలో వైసీపీ వెన్నులో వణుకు మొదలైందని టీడీపీ ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ రాష్ట్ర నాయకులు అన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకుని దమనకాండలు ప్రదర్శిస్తున్న జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ముప్పాళ్ల మండలం తొండపిలో ఆదివారం రాత్రి టీడీపీ సభను అడ్డుకుని దమనకాండ ప్రదర్శించిన డీఎస్పీ ఆదినారాయణను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అంబటి రాంబాబు అధికారం అడ్డుపెట్టుకుని పిరికిపంద చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఫ్యాక్షన్ రాజకీయాలను రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు అవలంభిస్తున్నారు. సత్తెనపల్లిలో అంబటి రాంబాబు దుర్మార్గాలు దౌర్జన్యాలకు కాలం చెల్లిందన్నారు. కన్నా లక్ష్మీనారాయణకి డీఎస్పీ ఆదినారాయణ బహిరంగ క్షమాపణ చెప్పాలని టీడీపీ ఎస్సీ, ఎస్టీ బీసీ మైనారిటీ రాష్ట్ర నాయకులు ఈమని చంద్రశేఖర్, కొర్రపాటి సురేష్, ఎస్ఎం నిజాముద్దీన్, పాలపర్తి రాము, టైగర్ ప్రసాద్ తదితరులు డిమాండ్ చేశారు.

మాచర్లలో షర్మిల బహిరంగ సభ

మాచర్ల రూరల్, జనవరి 28 : మాచర్ల పట్టణంలో ఫిబ్రవరి రెండో వారంలో వైఎస్ షర్మిల బహిరంగ సభ ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ యరమల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో నియంత పాలన చేస్తున్న జగన్ ప్రభుత్వం అరాచకాలపై ప్రజలకు తెలియజేయడానికి షర్మిల సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట చిమటా వెంకటేశ్వర్లు, రాగిడి ప్రతాప్‌బాబు, షేక్ బాబు, వంగపాటి నాగరాజు, ఆదిరెడ్డి, రమేష్, అచ్చయ్య తదితరులు ఉన్నారు.

ఇరువురు అధికారుల బదిలీ

మాచవరం, జనవరి 28 : త్వరలో జరుగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో పలుశాఖల అధికారులను ఉన్నతాధికారులు బదిలీ చేశారు. ఎంపీడీవో వరప్రసాద్‌ను ప్రకాశం జిల్లాకు బదిలీ చేయగా, మాచవరం ఎస్‌ఐ సమీర్‌బాషాను రాజుపాలెం మండలానికి బదిలీ చేశారు. ఎస్‌ఐ సమీర్‌బాషా డివిజన్‌లో మూడేళ్లు పని చేసినందుకు గాను బదిలీ తప్పలేదు.

జనసేన అధికార ప్రతినిధి ప్రసాద్‌కు సన్మానం

దుర్గి, జనవరి 28 : జనసేన పార్టీ నియోజకవర్గ ప్రతినిధిగా నక్షత్రపు ప్రసాద్ నూతనంగా ఎంపికయ్యారు. ఈ మేరకు దుర్గిలో టీడీపీ, జనసేన నేతలు ప్రసాద్‌ను దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. రానున్న ఎన్నికల్లో మాచర్ల నియోజకవర్గంలో ఉమ్మడి అభ్యర్థిని గెలిపించుకోవాలని తీర్మానించుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త బూసా రామాంజినేయులు, జిల్లా కార్యదర్శి పులి హరి, మండల అధ్యక్షుడు తోటకూర శ్రీనివాసరావు, రుద్రాల రవి, కేసనపల్లి కృష్ణబాబు, గంధం మల్లయ్య, గుండెబోయిన సాంబశివరావు, అంబటి నరసింహారావు, కొప్పుల వెంకటరమణ, టీడీపీ నేతలు జానకి రామయ్య, మేకల దాసు, మాచర్ల వాసు, సింగు నాగేశ్వరరావు, సూరె వెంకటేశ్వర్లు, వీరాస్వామి, మునగా రాంబాబు, బీజేపీ మండల అధ్యక్షుడు వెలిదండి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యుత్ శాఖ ప్రజాభిప్రాయ సేకరణ

మాచర్ల, జనవరి 28: పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో సోమవారం నుంచి మూడు రోజులపాటు బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని ఈఈ హరిబాబు తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరుగుతున్న ఈ కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారులు పాల్గొని తమ అభిప్రాయాలు తెలియజేయాలని కోరారు.

అక్రమ మద్యం స్వాధీనం

వెల్దుర్తి, జనవరి 28 : మాచర్ల సెబ్ అధికారులు ఆదివారం వెల్దుర్తి మండలంలోని శ్రీరాంపురంతండాలో దాడులు నిర్వహించారు. మేరాజోత్ అంజినాయక్ వద్ద 15 బాటిళ్ల అక్రమ మద్యం కనుగొని స్వాధీనం చేసుకున్నారు. అంజినాయక్‌ను అదుపులోకి తీసుకున్నారు.

చిరంజీవికి పద్మ విభూషణ్ రావటంపై హర్షం

సత్తెనపల్లి, జనవరి 28 : సినీ నటుడు చిరంజీవికి పద్మ విభూషణ్ అవార్డు వచ్చిన సందర్భంగా ఆదివారం జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ జనసేన సమన్వయ కర్త బొర్రా వెంకట అప్పారావు ఆధ్వర్యంలో బాణ సంచా కాల్చి కేక్ కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొమ్మిశెట్టి వెంకట సాంబశివరావు, సిరిగిరి పవన్, రంగిశెట్టి సుమన్, నాదెండ్ల నాగేశ్వరరావు, నరిచేటి వేణుగోపాల్, సోమిశెట్టి సుబ్రహ్మణ్యం, అంకమరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ప్రాణాలు తీస్తున్న బెల్లంకొండ రహదారులు : రమాదేవి

బెల్లంకొండ, జనవరి 28 : బెల్లంకొండ రోడ్లు ప్రజల ప్రాణాలు తీసే రహదారులుగా మారాయని జనసేన మండల అధ్యక్షురాలు తోట రమాదేవి అన్నారు. బెల్లంకొండ మెయిన్ సెంటర్ ఆదివారం టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రమాదేవి మాట్లాడుతూ మండలంలో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని అన్నారు. 108 వాహనం వచ్చే లోపే ప్రాణాలు పోతున్నా పాలకులకు పట్టదా? అని ప్రశ్నించారు. మన్నెసుల్తాన్‌పాలెం నుంచి వెంకటాయపాలెం వెళ్లే రహదారి పూర్తి అధ్వానంగా తయారైందన్నారు. గతంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు రహదారి నిర్మించిన తరువాతే వెంకటాయపాలెం గ్రామానికి వస్తానని చెప్పి వాగ్దానం చేసి మరచి పోయారని అన్నారు. అదేవిధంగా బెల్లంకొండ-కొత్తపాలెం, బెల్లంకొండ-నందిరాజుపాలెం వెళ్లే రహదారులను నిర్మిస్తామని చెప్పి జేసీబీలతో పగల గొట్టించి సంవత్సరం కావస్తున్నా పట్టించుకొనే వారే లేరని విమర్శించారు. మండలంలోని కొత్తపాలెం గ్రామానికి తాగు నీటి సదుపాయం లేక పేదలు ఇబ్బందులు పడుతున్నారని ఆమె అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఎస్సీ సెల్ నాయకుడు గడ్డిపర్తి సముద్రం, జనసేన మండల ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరావు, ముళ్ళా బిక్షం, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

శివశంకర్ నాయక్ మరిన్ని ఉత్తమ సేవలందించాలి

నకరికల్లు, జనవరి 28 : అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఇన్‌కం ట్యాక్స్ అధికారిగా నియమితులైన మూడావత్ శివ శంకర్ నాయక్ మెరుగైన ప్రభుత్వ సేవలు అందించాలని ఆయన సహచర పూర్వ విద్యార్థులు ఆకాంక్షించారు. నకరికల్లు మండలం అడ్డరోడ్డు గ్రామంలో ఆదివారం మూడావత్ శివ శంకర్ నాయక్‌ను 1993 ఎస్ఎస్ఎన్ కళాశాల పూర్వ విద్యార్థులు అభినందించారు. ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అర్వపల్లి పుల్లారావు, ఎస్ రాజశేఖర్, కే బాబు, శ్రీనివాసరావు, బాలాజీ, మాజీ జెడ్పీటీసీ రామావత్ స్వామ్రాజ్యం బాయి, జల్లాపేట సర్పంచ్ రామావత్ పార్వతి బాయి, రాములు నాయక్, రామారావు, దుర్గా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్నాం : ఎమ్మెల్యే శంకరరావు

పెదకూరపాడు, జనవరి 28 : నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామని ప్రజలు అండగా నిలబడాలని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మండలంలోని బలుసుపాడులో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్, ఎస్సీ కమ్యూనిటీ హాల్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శంకరరావు సతీమణి వసంత కుమారి, క్రోసూరు మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, జడ్పీటీసీ కంకణాల స్వర్ణ కుమారి శివాజీ, బలుసుపాడు ఎత్తిపోతల పథకం కమిటీ చైర్మన్ బచ్చు హనుమంతరావు, ఎంపీటీసీ రాయవరపు ఉమామహేశ్వరరావు, వైసీపీ నేతలు నూతలపాటి వెంకట శివరావు, 75 తాళ్ళూరు వ్యవసాయ సహకార సంఘం చైర్‌పర్సన్ కల్లి శ్రీనివాసరెడ్డి, యామర్తి మస్తాన్‌రావు, వైసీపీ కన్వీనర్ మస్తాన్ షరీఫ్ పాల్గొన్నారు. అలాగే పెదకూరపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 730 డ్వాక్రా సంఘాలకు రూ.6.63 కోట్ల ఆసరా చెక్కులను ఆయన అందజేశారు. మండలంలోని గారపాడు, జలాలపురం తదితర గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సచివాలయ, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారు. గారపాడులో జడ్పీటీసీ కంకణాల స్వర్ణ కుమారి శివాజీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

75 తాళ్ళూరు సర్పంచ్‌గా నర్సయ్య

పెదకూరపాడు, జనవరి 28 : మండలంలోని 75 తాళ్ళూరు గ్రామ సర్పంచ్‌గా భూతం నర్సయ్య ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సర్పంచ్‌ని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్ యార్డు కమిటీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, వ్యవసాయ సహకార సంఘం చైర్‌పర్సన్ కల్లి శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ అల్లం భవానీ, మాజీ సర్పంచ్ చిర్రా శ్రీనివాసరెడ్డి, వి.శ్రీనివాసరెడ్డి, విద్యా కమిటీ చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శి నెక్కంటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్‌వీఎస్ రాజు

అమరావతి, జనవరి 28 : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శిగా మండల పరిధిలోని ఎండ్రాయి గ్రామానికి చెందిన ఎన్‌వీఎస్ రాజును నియమిస్తూ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. తన నియామకానికి కారణమైన మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు రాజు తెలిపారు. టీడీపీ గెలుపుకోసం తనవంతు కృషి చేస్తానని చెప్పారు.

అమరావతి ఎస్ఐగా రంగారావు

అమరావతి, జనవరి 28 : అమరావతి ఎస్ఐగా కె.రంగారావు ఆదివారం స్థానిక పోలీసు స్టేషన్‌లో రిపోర్టు చేసి బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం, గుంటూరు జిల్లాలో పలు చోట్ల విధులు నిర్వహించిన రంగారావును ప్రస్తుతం అమరావతి ఎస్ఐగా జిల్లా అధికారులు నియమించారు. రంగారావుతో కలిపి నలుగురు ఎస్ఐలు అమరావతి పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నారు.

బైకును ఢీకొన్న గుర్తు తెలియని వాహనం : వ్యక్తి మృతి

మాచర్ల, జనవరి 28 : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని భైరవునిపాడు వద్ద ఆదివారం జరిగింది. సాగర్ వైపు నుంచి మాచర్ల వైపు ఇరువురు వ్యక్తులు వస్తుండగా మార్గ మధ్యలో భైరవునిపాడు వద్ద గుర్తు తెలియని భారీ వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. మృతదేహాన్ని పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వారి వివరాలు తెలియరాలేదు.



కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో పార్టీలో చేరిన ముస్లింలు

రాక్షస పాలనను పారదోలాలి

● టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, జనవరి 28 : రాష్ట్రంలో రాక్షస పాలనను పారదోలేందుకు ప్రతి ఒక్కరు ముందుకు రావాలని టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని 26వ వార్డులో టీడీపీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వంద కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కన్నా మాట్లాడుతూ రాష్ట్రాన్ని రక్షించు కోవటం కోసం రానున్న ఎన్నికల్లో పోరాటం చేయాలన్నారు. చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా చేసుకోవటం ద్వారానే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమన్నారు. వైసీపీకి చెందిన మహమ్మద్ జానీ, అల్లాభక్షు, జేపీఎస్ జానీ బాషా, నాగుల్ మీరా, మహబూబ్ సుభానీ, జానీ, బాజీ, ఆసీస్, బాజీ సైదు, దాదావలి, షేక్ బాబు, నాగుల్ షరీఫ్, గౌస్, మహమ్మద్ సుభానీ, మహబూబ్, అజుంతుల్లా, అబ్దుల్లా, ఖలీల్, మహమ్మద్ ఆలీ, అబ్దుల్ రెహ్మాన్, మీరావలి, సైదులు, సిలార్, మదార్‌లతో పాటు వంద కుటుంబాల సభ్యులు సయ్యద్ నాగుల్ మీరా ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వీరందరికీ టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముందుగా పట్టణంలోని రఘురామ్ నగర్‌లో గల కన్నా కార్యాలయం వద్ద నుంచి 26వ వార్డు వరకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ముస్లిం మైనార్టీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎలినేడి రామస్వామి, ఆతుకూరి నాగేశ్వరరావు, కటకం రామకృష్ణ, ఆళ్ళ అమరేశ్వరరావు, తాళ్ళ వెంకటేష్ యాదవ్, సయ్యద్ మాబూ, నూర్ బాషా జానీ బాబు, సయ్యద్ రాంబో బుడే, షేక్ దూదేకే, నూర్ మొహిద్దీన్, పూజల వెంకట కోటయ్య, సీతయ్య, ఆర్మీ సైదా, సయ్యద్ జాన్, సయ్యద్ నాగుల్ మీరా, బొక్కా సంగీతరావు, బండారు నాగరాజు తదితర టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజుపాలెం మండలం కోటనెమలిపురికి చెందిన టీడీపీ నేత కోటిరెడ్డి ఆధ్వర్యంలో వైసీపీ కార్యకర్తలు ఆదివారం సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి కన్నా పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గుడిపూడి చెన్నయ్య, సవలం రవి, పుల్లయ్య, పేరం ఏసోబు, అంకామళ్ళ మరియదాసు, దొడ్డా సంజీవరెడ్డి వైసీపీని వీడి టీడీపీలో చేరారు.

8, 16, 21 వార్డులకు చెందిన పలువురు టీడీపీలో చేరిక

సత్తెనపల్లి పట్టణంలోని 8, 16, 21 వార్డులకు చెందిన పలువురు వైసీపీ కార్యకర్తలు ఆదివారం పట్టణంలోని రఘు రామ్‌నగర్‌లో గల టీడీపీ ప్రజావేదికలో టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి కన్నా పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. 16వ వార్డు నుంచి ఆ వార్డు కౌన్సిలర్ కంభంపాటి అబ్రహం, బంగారు నాగరాజు, నల్లూరి కిరణ్ ఆధ్వర్యంలో టీడీపీలో జాయిన్ అయిన ఎస్సీలు మాణిక్యరావు, వెంకటేష్, లక్ష్మీనారాయణ, ఏ.వెంకటేష్ తదితరులు ఉన్నారు. 8వ వార్డుకు చెందిన గుజ్జర్లపూడి చింతు, యారిపోగు బాలరాజు, తమ్ముడు ప్రసాదు తదితరులు ఆ వార్డుకు చెందిన ఎల్.రవి, నరేష్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. 21వ వార్డు నుంచి తోట వెంకయ్య, పున్నా శ్రీనివాసరావు, చింతగింజల శ్రీనివాసరావు తదితరులు 21వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ జోరిగె శ్రీనివాసరావు, కార్యదర్శి సిరసాల బాస్కర్, అధ్యక్షుడు యక్కల సుబ్బారావుల ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారందరికీ కన్నా లక్ష్మీనారాయణ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎలినేడి రామస్వామి, కటకం రామకృష్ణ, బొక్కా సంగీతరావు, గుజ్జర్లపూడి చంద్రకాంత్, అంకాళ్ళ ప్రభుదాసు, బండారు నాగరాజు తదితరులు పాల్గొన్నారు. రాజుపాలెం మండలం దేవరంపాడు గ్రామ సర్పంచ్ కొప్పుల పిచ్చయ్య వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. కన్నా లక్ష్మీనారాయణ పిచ్చయ్యకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

నాగోతు శౌరయ్య ఆధ్వర్యంలో...



కన్నా, శౌరయ్య సమక్షంలో టీడీపీలో చేరిన నకరికల్లు వాసులు

నకరికల్లు, జనవరి 28 : నకరికల్లుకు చెందిన పలు వురు ఆదివారం టీడీపీలో చేరారు. సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ మండల అధ్యక్షుడు నాగోతు శౌరయ్య ఆధ్వర్యంలో 30 కుటుంబాలకు చెందిన వారు టీడీపీలో చేరారు. వారందరికి కన్నా పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పరసా రామారావు, పరసా చిన రామకోటి, మోరా పేరిరెడ్డి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో నకరికల్లు టీడీపీ గ్రామ అధ్యక్షుడు తిరుమలశెట్టి వెంకటరావు, టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు దూదేకుల హుస్సేన్‌బీ, ఢీకొండ మహానంది, షేక్ జాను, షేక్ మహమ్మద్ షా, టైపు రవి, వజ్రగిరి ప్రసాదు, తిరుమలశెట్టి చిన రంగయ్య, వజ్రగిరి బాలరాజు, వజ్రగిరి ఇన్నయ్య తదితరులు ఉన్నారు.

వైసీపీ కార్యక్రమంలా రోశయ్య విగ్రహావిష్కరణ

సత్తెనపల్లి, జనవరి 28 : రోశయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని వైసీపీ అనుబంధ కార్యక్రమంలా నిర్వహించారని టీడీపీ నేతలు అన్నారు. ఆదివారం మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య విగ్రహం వద్ద టీడీపీ నాయకులు విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో చెత్తాచెదారం వేసే ప్రాంతాల్లో రోశయ్య విగ్రహం ఏర్పాటు చేయటం దారుణమన్నారు. ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం పేరుతో చందాలు వసూలు చేసి విగ్రహావిష్కరణ సభ మాత్రం మంత్రి అంబటి రాంబాబు చెప్పినట్టు చేయటం దారుణమన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చౌట శ్రీనివాసరావు, అతుకూరి నాగేశ్వరరావు, దివ్వెల శ్రీనివాసరావు, జవ్వాజి రామ్మోహనరావు, పోతుగంటి రామకోటేశ్వరరావు, దూపగుంట్ల జానకి రామారావు, నేముల వెంకట రమణ, బచ్చు కొండలు తదితర నేతలు ఉన్నారు.

త్యాగరాజ సంకీర్తన కార్యక్రమం

సత్తెనపల్లి, జనవరి 28 : పట్టణంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో ఆదివారం స్వామి వివేకానంద చైతన్య భారతీ ఆధ్వర్యంలో త్యాగరాజ సంకీర్తన కార్యక్రమం జరిగింది. ప్రసిద్ధ సంగీత విద్వాంసులు రవి కులోత్తమ రావు త్యాగరాజ గానం చేశారు. కార్యక్రమంలో పట్టణానికి చెందిన డాక్టర్లు జీ శ్రీధర్, చంద్రశేఖర్, గిరిజ, డాక్టర్ షకీల శ్రీధర్, పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అత్యంత భక్తి పారవశ్యంతో త్యాగరాజ గీతాలాపనలు సంగీత విద్వాంసులు ఆలపించి సంగీత ప్రియులకు శ్రవణానందం కలిగించారు.

ఉచిత రక్త పరీక్షల శిబిరం

సత్తెనపల్లి, జనవరి 28 : పట్టణంలోని 30వ వార్డులో టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు గుంటూరు ఆశీర్వాదం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత రక్త పరీక్షల శిబిరాన్ని టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో 31వ వార్డు కౌన్సిలర్ తురగా మేరీ గ్రేస్, ఆతుకూరి నాగేశ్వరరావు, నూర్ బాషా జానీ బాబు, ఎం.వెంకటేశ్వరరావు, ప్రకాష్, దూదేకే, పాల్గొన్నారు.

మాల మహానాడు నూతన నియామకాలు

సత్తెనపల్లి, జనవరి 28 : మాల మహానాడు జిల్లా ప్రధాన కార్యదర్శిగా రెంటపాళ్ళకు చెందిన ఏకుల రాజశేఖర్‌ను, నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడిగా మాలె పద్మారావు, సత్తెనపల్లి పట్టణ ఉపాధ్యక్షుడిగా మాతంగి రాహుల్ గౌతమ్‌ను మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోదా జాన్‌పాల్ ఆదివారం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నేతలు గుంటూరు ఆశీర్వాదం, కూచిపూడి జాన్‌బాబు, ఎం.మరియదాసు, కిరణ్, జోసెఫ్, జడా కమల్ పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

పోలీసుల వేధింపుల వల్లే టీడీపీ కార్యకర్త ఆత్మహత్య

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు



నరసరావుపేట టౌన్, జనవరి 28: పోలీసుల వేధింపులు తాళలేక టీడీపీ కార్యకర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడని, రక్షణ ఇవాల్సిన పోలీసులు వల్లే అమాయకుల ప్రాణాలు పోయే పరిస్థితి వచ్చిందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు ఆదివారం ఒక ప్రకటనలో విమరించారు. వెల్దుర్తి మండలం బంగారుపెంట తండాకు చెందిన టీడీపీ కార్యకర్త దుర్గారావు పోలీసుల వేధింపులు తాళలేక ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడడం బాధాకరమన్నారు. వెల్దుర్తి పోలీసులు వేధింపులను టీడీపీ తీవ్రంగా ఖండిస్తుందని, దుర్గారావు మృతికి పోలీసులు సమాధానం చెప్పాలన్నారు. తెలుగుదేశం పార్టీలో చురుకుగా పనిచేస్తున్న దుర్గారావు అధికార వైసీపీ టార్గెట్‌చేసి పోలీసులను అడ్డం పెట్టుకొని అక్రమ మద్యం కేసు బనాయించారని అన్నారు. బాధితుడు హైకోర్టు ద్వారా ముందస్తు బెయిల్ పొందినా, దుర్గారావు టీడీపీని వదిలి వైసీపీలో చేరాలని కొన్ని నెలలుగా వెల్దుర్తి ఎస్‌ఐ ఒత్తిడికి గురిచేశారని అన్నారు. పార్టీని వీడేది లేదని అనడంతో కక్షకట్టి అక్రమ మద్యం కేసు బనాయించి వేధించడం దుర్మార్గమన్నారు. పోలీసుల వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడిన దుర్గారావు మృతికి పోలీసులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రక్షణ ఇవ్వాల్సిన పోలీసుల వల్లే ప్రాణాలుపోయే పరిస్థితుల్లోకి రాష్ట్రాన్ని తీసుకువెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దుర్గారావు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

వైసీపీ పాలనలో అభివృద్ధి సంక్షేమం ఎక్కడ

● టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ధారునాయక్



నరసారవుపేట టౌన్, జనవరి 28: గిరిజనులకు 16 సంక్షేమ పథకాలు రద్దు చేసిన వైసీపీ పాలనలో అభివృద్ధి సంక్షేమం ఎక్కడ ఉందని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు ఎం.ధారునాయక్ ఆదివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చి సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని చెప్పి నాలుగున్నర సంవత్సరాలలో బడుగు, బలహీనవర్గాలకు మొండిచేయి చూపించి జగన్ మోహన్‌రెడ్డి మోసం చేశాడని విమర్శించారు. వైసీపీ పాలనలో గిరిజనులు విద్యకు దూరమయ్యారని, తండాలలో ప్రతి ఇంటికి 200 యూనిట్ వరకు ఉచిత విద్యుత్ అని చెప్పి ఇప్పటికి బిల్లు కట్టుమంటున్నారని అన్నారు. 45సంవత్సరాలు నిండిన ప్రతి ఎస్టీ అక్కలకు రూ.75వేలు ఇస్తామని చెప్పి మాటమార్చారని అన్నారు. ప్రమాదవశాత్తు మరణిస్తే ఎస్టీలకు రూ.5 లక్షలు బీమా కల్పిస్తామని చెప్పి మోసం చేశారని, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించారని అన్నారు. నామినేటెడ్ పదవులలో ఎస్టీలకు రిజర్వేషన్ కల్పిస్తూ చట్టం తీసుకువస్తామని చెప్పారని, సాగు చేసుకుంటున్న అడవి హక్కుల చట్టం భూములకు పట్టాలు ఇస్తామని చెప్పి ఇవ్వకపోవడం దారుణం అన్నారు. ఐటీడీఏలలో అవినీతి విచ్చలవిడిగా ఉన్న ప్రశ్నించే నాథుడే లేడని, పనికిరాని ఉపముఖ్యమంత్రి రాజన్న దొరను వెంటనే భర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఏమైనా ప్రశ్నిస్తే దాడులు, అక్రమ కేసులు పెట్టే వైసీపీ నాయకులకు రాబోయే ఎన్నికలలో ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. గత ఎన్నికలలో గిరిజనులు 87శాతం వైసీపీకి ఓట్లు వేస్తే ఇదా ఎస్టీలకు చేసేదని ప్రశ్నించారు. దుర్మార్గపు ముఖ్యమంత్రి, అవినీతి వైసీపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికలలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

కుల గణన సర్వేలో జాప్యం

● సచివాలయ సిబ్బంది లేకపోవటమే కారణం

రొంపిచర్ల, జనవరి 28: మండలంలోని గ్రామాల్లో కులగణన సర్వే ఆలస్యమవుతోంది. ఈ నెల 28వ తేదీకి సర్వే పూర్తి కావల్సి ఉంది. ఐతే గ్రామాల్లో వలంటీర్లు సహకరించకపోవటం, సచివాలయాల్లో సిబ్బంది సెలవుపై వెళ్ళటం ఆలస్యానికి కారణాలు భావిస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కులగణన సర్వేకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఐతే రొంపిచర్ల మండలంలో సర్వే సక్రమంగా జరగటం లేదనే విమర్శలు వినవస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ నామమాత్రంగానే ఉంది. ప్రభుత్వ పథకాలు అందాలంటే సర్వే పూర్తయి ఉండాలని సంబంధిత వలంటీర్లు ఆయా గ్రామాల ప్రజలకు చెపుతున్నారు. దీంతో ప్రజలు సర్వే చేయించుకోకపోతే తమకు ప్రభుత్వ పథకాలు అందవేమోననే భ్రమల్లో ఉన్నారు. అధికారులు స్పందించి సర్వేను సరైన సమయంలో పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

జిల్లాస్థాయి పోటీలకు మహిళల క్రికెట్ జట్టు ఎంపిక

శావల్యాపురం, జనవరి 28: వినుకొండలోని లయోలా పాఠశాలలో ఈ నెల 27న నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ఆడుదాం-ఆంధ్ర క్రికెట్ పోటీలలో మహిళల విభాగంలో శావల్యాపురం మండలం జట్టు ప్రథమస్థానంలో నిలిచి జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించగా, పురుషుల విభాగంలో శావల్యాపురం మండలం జట్టు ద్వితీయ స్థానంలో నిలిచిందని మండల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ రాగుల రాధాకృష్ణమూర్తి ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఫైనల్‌లో మహిళల విభాగంలో ఈపూరు మండలం మహిళల జట్టు, శావల్యాపురం మండలం మహిళల జట్టు పోరాడగా శావల్యాపురం జట్టు విజయం సాధించిందని తెలిపారు. పురుషుల విభాగంలో కూడా ఈపూరు మండలం జట్టు, శావల్యాపురం మండల జట్టు పోరాడగా ఈపూరు జట్టు విజయం సాధించిందని తెలిపారు. ఈ నెల 31న నరసరావుపేటలో జరగనున్న జిల్లాస్థాయి ఆడుదాం-ఆంధ్ర పోటీలలో శావల్యాపురం మహిళల జట్టు వినుకొండ నియోజకవర్గం తరపున జిల్లా పోటీల్లో పాల్గొంటుందన్నారు. ప్రథమస్థానంలో నిలిచిన శావల్యాపురం మహిళల జట్టుకు రూ.30వేల నగదు బహుమతి, ద్వితీయస్థానంలో నిలిచిన పురుషుల జట్టుకు రూ.15వేల నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రాలు, మెమొంటోలను త్వరలో అందజేయనున్నట్లు తెలిపారు.

విజేతలను ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య, పంచాయతీ కార్యదర్శి మహేందర్, హెచ్‌ఎం బొడ్డపాటి విజయలక్ష్మి, ఉపాధ్యాయులు శ్రీనివాసరాజు, ఆదాంఖాన్, శ్రీనివాసరావు, గురుబాబు, సురేష్, కవిత, పీడీలు రాధాకృష్ణ, రాజేష్, మణి, సుజాత, నాయకులు గుర్రం గోవిందరాజులు తదితరులు అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.



తిరునాళ్ల సందర్భంగా రామయోగయ్య స్వామి ఊరేగింపు

ఘనంగా పొట్లపాడు రామయోగయ్యస్వామి తిరునాళ్ల

వినుకొండ టౌన్, జనవరి 28: పట్టణంలోని నిమ్మలబావి బజారులో పొట్లపాడు రామయోగయ్యస్వామి తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణ పురవీధుల్లో స్వామివారి ఊరేగింపు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రధాన సేవకుడు జాజుల మాల్యాద్రి పాల్గొని నిమ్మలబావి బజారులోని భక్తులు గత 24సంవత్సరాలుగా తిరునాళ్ల మహోత్సవాన్ని నిర్వహించడం గొప్పవిషయమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎస్.పుల్లయ్య, బి.నరసింహారావు, గురవయ్య, దానయ్య, అంకమ్మరావు, నాగలక్ష్మి, బుజ్జి, ప్రశాంతితో పాటు స్వామివారి భక్తబృందం పాల్గొన్నారు.

నూజెండ్లలో...

నూజెండ్ల, జనవరి 28: నూజెండ్ల శ్రీ రామ యోగ స్వామి తిరునాళ్ళ ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచే భక్తులు పెద్దసంఖ్యలో హాజరై దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరునాళ్ళను పురస్కరించుకొని రాజకీయ పార్టీల నాయకులు, అభిమానులు నిర్మించిన నాలుగు భారీ విద్యుత్ ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు తిరునాళ్ళకు వచ్చిన భక్తులను అలరించాయి. రాత్రి సమయంలో రామయోగస్వామి చిత్రపటంతో గ్రామోత్సవం నిర్వహించారు. వినుకొండ ప్రాంతంలో మొదటిగా వచ్చిన తిరునాళ్ళ కావటంతో పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

వినుకొండ, జనవరి 28: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాలపై వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా పట్టణంలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ముందుగా బస్టాండ్ సెంటర్, ఎంపీడీవో కార్యాలయం వద్ద మొబైల్ వ్యాన్ ద్వారా ఎల్‌ఈడీ స్క్రీన్‌లు పెట్టి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు సంక్షేమ పథకాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ వెంకయ్య, మేనేజర్ శ్రీనివాసరావులతో పాటు బీజేపీ నాయకులు మేడం రమేష్, యర్రగొండపాలెం బీజేపీ ఇన్‌చార్జి ఎనుముల నాగేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు రాఘవులు, సుజాత, మెప్మా, పురపాలక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు కలలా సొంతిల్లు

● టిడ్కో గృహాల్లో ఊసేలేని డబుల్ బెడ్‌రూమ్‌లు
● డబ్బులు చెల్లించి ఐదేళ్లయినా అప్పగించని గృహాలు
● ఇంటి కోసం ఎదురుచూస్తున్న పేదలు
● మౌలిక వసతులు కల్పించి ఇళ్లు అప్పగించాలి



నత్తనడకన సాగుతున్న టిడ్కో ఇళ్ల నిర్మాణాలు

వినుకొండ, జనవరి 28: పట్టణంలో నిరుపేదలకు సొంతిల్లు కలగా మిగిలింది. గత ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వం పేదల కోసం టిడ్కో ఇళ్ల నివాసానికి 2వ విడత కార్యక్రమంలో భాగంగా వినుకొండ వెల్లటూరు రోడ్డులోని కొండ సమీపంలో అప్పటి రాష్ట్ర మంత్రి నారాయణరావు చేతుల మీదుగా ఇంటి నిర్మాణాలకు శంకుస్థాపన నిర్వహించారు. అనతికాలంలో పేదలకు నివాసాలు ఏర్పాటు చేసేందుకు చకచకా ఇంటి నిర్మాణాలను చేపట్టారు. మొత్తం 1440 గృహనిర్మాణాలకు పనులు ప్రారంభించారు. వినుకొండ పట్టణంలోని పేదలకు సింగిల్, డబుల్ బెడ్‌రూమ్ నిర్మాణాలకు మున్సిపల్ అధికారులు డబ్బులు కట్టించుకున్నారు. సింగిల్ బెడ్‌రూమ్ మొత్తం 864 నివాస గృహాలు నిర్మాణాలకు 720 గృహాలు, డబుల్ బెడ్‌రూమ్ 576 గృహాలకు గాను కేవలం 70 గృహాలు శ్లాబ్‌లు వేసి ఆపివేశారు. నూతనంగా ఇంద్రజిత్ మెహతా ఆధ్వర్యంలో చేపడుతున్న ఇంటి నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలకు టిడ్కో ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చి ఐదేళ్లు గడుస్తున్నా పేదల సొంతింటి కల మాత్రం నెరవేరిన దాఖలాలు లేవు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సింగిల్ బెడ్‌రూమ్ ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారే తప్ప డబుల్ బెడ్‌రూమ్‌ల ఊసే లేదు. ఇదిలా ఉండగా వెల్లటూరు రోడ్డు ప్రధాన రహదారి నుంచి టిడ్కో ఇళ్ల వరకు రహదారి నిర్మించి లైటింగ్‌తో పాటు నివాసగృహాల వద్ద మౌలిక వసతులు కల్పించాలి. మరో నెల రోజుల్లో ఎన్నికల సమీపిస్తున్నప్పటికీ నివాస గృహాలను మాత్రం పూర్తిచేసిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా అధికారులు టిడ్కో నివాస గృహాలను పూర్తిచేసి మౌలిక వసతులు కల్పించి పేదలకు ఇళ్లు అప్పగించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

ఒంటెద్దు పోకడలు మంచిది కాదు

● మాజీ ఎమ్మెల్యే మక్కెన
● ఎమ్మెల్యే బొల్లాపై పరోక్ష విమర్శలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు

వినుకొండ, జనవరి 28: నియోజకవర్గ అభివృద్ధి ఏ ఒక్క ఎమ్మెల్యేది కాదని, అంతా తానే చేశానన్న ధోరణి, ఒంటెద్దు పోకడ మంచిది కాదని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుపై మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పరోక్ష వ్యాఖ్యలు చేశారు. పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం శాశ్వతం కాదని, రౌడీయిజం వినుకొండకు మంచిది కాదని అన్నారు. వినుకొండ అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని, ఈ ప్రాంత రైతులు, ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలన్నదే తన అభిమతమన్నారు. 1952లో వినుకొండ నియోజకవర్గం ఏర్పాటైన దగ్గర నుంచి ఈ ప్రాంత అభివృద్ధికి పది మంది ఎమ్మెల్యేలు కృషిచేశారన్నారు. తన హయాంలో వినుకొండ పంచాయతీ నుంచి మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ కావడం జరిగిందని, వినుకొండ పట్టణానికి రూ.100కోట్లు, రూరల్ మండలాలకు రూ.300కోట్లు మొత్తం రూ.400కోట్లతో అభివృద్ధి చేయడం జరిగిందని తెలిపారు. నేను ఎమ్మెల్యేగా, వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు వినుకొండ అభివృద్ధి చేయడానికి ఎంతో సహకరించారన్నారు. ఆయన కుమారుడు జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అవడానికి 2019ఎన్నికల్లో వైసీపీలోకి చేరి బొల్లా గెలుపునకు ఉడతాభక్తిగా సాయం చేశానన్నారు. ఇప్పటికీ కూడా నియోజకవర్గంలో వరికపూడిశెల ప్రాజెక్టు, బొల్లాపల్లి మండలంలో కొన్ని గ్రామాల్లో తాగునీరు, గుండ్లకమ్మ ప్రాజెక్టు నిర్మాణం చేపట్టలేకపోవడం ప్రజాప్రతినిధులుగా ఈ వైఫల్యం మా పది మంది ఎమ్మెల్యేలపై ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో నిలబడే అభ్యర్థులు ఏ పార్టీ వారైనా కాని వ్యక్తిగత దూషణలు మానుకొని హుందాగా వ్యవహరించాలన్నారు. ఎవరు చేసిన అభివృద్ధి వారు చెప్పుకోవాలే తప్ప కుటుంబసభ్యులను వీధిలోకి తీసుకురావడం మంచిపద్ధతి కాదని ఆయన హితవుపలికారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు బాటలో వెళతారా అని విలేకరులు మక్కెనను అడగ్గా శ్రీకృష్ణదేవరాయలు మన ప్రాంత అభివృద్ధికి, వరికపూడిశెల ప్రాజెక్టుకు అటవీశాఖ అనుమతులు తీసుకురావడానికి కృషిచేశారని, ఆయనపై ప్రత్యేక అభిమానం తనకు ఉందన్నారు. ఒక వ్యక్తిపై ఆధారపడి తాను నిర్ణయాలు తీసుకోనని, తన అభిమానులు, కార్యకర్తలు, ఇప్పటివరకు నా అభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన ప్రజల నిర్ణయం మేరకు నడుచుకుంటానని, కచ్చితంగా 2024 ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నట్లు మక్కెన తెలిపారు. కార్యక్రమంలో గుంటకల ప్రసాద్, గుర్నాథం, కాలేషా, రెడ్డి వెంకటరత్నం తదితరులు ఉన్నారు.

కన్నా దెబ్బకు వైసీపీ వెన్నులో వణుకు

● డీఎస్పీ ఆదినారాయణను తక్షణమే సస్పెండ్ చేయాలి
● టీడీపీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రాష్ట్ర నాయకుల డిమాండ్

సత్తెనపల్లి, జనవరి 28 : సత్తెనపల్లిలో కన్నా ఆధ్వర్యంలో టీడీపీ లోకి వైసీపీ నేతలు భారీగా వలసలు రావడంతో రాష్ట్రంలో వైసీపీ వెన్నులో వణుకు మొదలైందని టీడీపీ ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ రాష్ట్ర నాయకులు అన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకుని దమనకాండలు ప్రదర్శిస్తున్న జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. ముప్పాళ్ల మండలం తొండపిలో ఆదివారం రాత్రి టీడీపీ సభను అడ్డుకుని దమనకాండ ప్రదర్శించిన డీఎస్పీ ఆదినారాయణను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అంబటి రాంబాబు అధికారం అడ్డుపెట్టుకుని పిరికిపంద చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఫ్యాక్షన్ రాజకీయాలను రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు అవలంభిస్తున్నారు. సత్తెనపల్లిలో అంబటి రాంబాబు దుర్మార్గాలు దౌర్జన్యాలకు కాలం చెల్లిందన్నారు. కన్నా లక్ష్మీ నారాయణకి డీఎస్పీ ఆదినారాయణ బహిరంగ క్షమాపణ చెప్పాలని టీడీపీ ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ రాష్ట్ర నాయకులు ఈమని చంద్రశేఖర్, కొర్రపాటి సురేష్, ఎస్‌ఎం నిజాముద్దీన్, పాలపర్తి రాము, టైగర్ ప్రసాద్ తదితరులు డిమాండ్ చేశారు.

బైకును ఢీకొన్న గుర్తు తెలియని వాహనం: వ్యక్తి మృతి

మాచర్ల, జనవరి 28: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని భైరవునిపాడు వద్ద ఆదివారం జరిగింది. సాగర్ వైపు నుంచి మాచర్ల వైపు ఇరువురు వ్యక్తులు వస్తుండగా మార్గ మధ్యలో భైరవునిపాడు వద్ద గుర్తు తెలియని భారీ వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తికి గాయాలయ్యాయి. మృతదేహాన్ని పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వారి వివరాలు తెలియరాలేదు.



శావల్యాపురంలో కరపత్రాలు ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు

జయహో బీసీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

● టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటేశ్వర్లు

శావల్యాపురం, జనవరి 28: టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2వ తేదీన శావల్యాపురంలో జరగనున్న జయహో బీసీ బహిరంగ సభలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని టీడీపీ బీసీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఒత్తుల వెంకటేశ్వర్లు ఆదివారం పిలుపునిచ్చారు. శావల్యాపురం సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ బీసీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో జయహో బీసీ కరత్రాలను ఆవిష్కరించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీసీలపై దాడులు, అక్రమకేసులు పెరిగిపోయాయని, రానున్న ఎన్నికలలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీసీలకు చేపట్టబోయే సంక్షేమ కార్యక్రమాలు, బీసీల రక్షణకు చేపట్టబోయే చర్యలను జిల్లా టీడీపీ బీసీ నాయకులు జయహో బీసీ సభలో వివరించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు గుంటూరు సాంబశివరావు, నాయకులు గడిపూడి విశ్వనాథం, గోరంట్ల హనుమంతరావు, గద్దె మస్తాన్‌రావు, దొడ్డా ఏడుకొండలు, యలగాల సాంబయ్య, బైలడుగు రామాంజనేయులు, యర్లగొర్ల ఆదినారాయణ, బైలడుగు శ్రీనివాసరావు, మర్రి వెంకటేశ్వర్లు, కాటం వెంకటేశ్వర్లు, దన్నవరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రథోత్సవం

● హాజరైన వేలాది మంది భక్తులు
● పూజల్లో పాల్గొన్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే కాసు
● ప్రత్యేక పూజలు నిర్వహించిన చినజీయర్‌స్వామి



శ్రీ ప్రసన్నాంజనేయస్వామి రథోత్సవం, హాజరైన భక్తులు

పిడుగురాళ్ల, జనవరి 28: పిడుగురాళ్ల శ్రీ ప్రసన్నాంజనేయస్వామి రథోత్సవం ఆదివారం కన్నుల పండువగా జరిగింది. స్థానిక ప్రజాశక్తి నగర్‌లో ఉన్న శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయ 17వ వార్షికోత్స వం సందర్భంగా గత నాలుగు రోజులుగా పూజా కార్యక్రమాలు జరు గుతున్నాయి. చివరి రోజు ఆదివారం సీతారాముల కల్యాణం శ్రీశ్రీశ్రీ త్రిదండి చినజీయర్ స్వామి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. అనంత రం చినజీయర్‌స్వామి మాట్లాడుతూ ప్రతి మనిషి తప్పు చేయడానికి భయపడాలని, చేస్తే అది వెన్నంటి వుంటుందనే భయముంటేనే తప్పు చేయకుండా వుంటే స్వర్గ ప్రాప్తి కలుగుతుందన్నారు. దేశమంతా శ్రీరామ జపం చేస్తుందని, అలా చేస్తేనే దేశం సుభిక్షంగా ఉంటుంద న్నారు. రాముల వారి ప్రియభక్తుడైన ఆంజనేయస్వామికి పిడుగురా ళ్లలో అతిపెద్ద పండుగ, రథోత్సవం జరుపడం సంతోషమన్నారు. సీతారాముల కల్యాణ విశిష్టతను వివరించారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుతో పాటు ఎంఎల్‌సి జంగా కృష్ణమూర్తి తనయుడు పిడుగురాళ్ల జడ్పీటీసీ వెంకట కోటయ్య స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే కాసు మహేశ్‌రెడ్డి కూడా స్వామి వారిని దర్శించుకొని రథోత్సవాన్ని ప్రారంభించారు. మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో ప్రారంభ మైన రథోత్సవం పట్టణ ప్రధాన రహదారిలో కొనసాగింది. వేలాది మంది భక్తులు, మహిళలతో దేవాలయ ప్రాంగణంతో పాటు రహదారి మొత్తం కిక్కిరిసింది. రథోత్సవానికి, ఉత్సవ మూర్తుల విగ్రహాల ఊరేగింపునకు దారి పొడవున భక్తులు, మహిళలు కోలాట ప్రదర్శనలు చేస్తూ హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వేలాది మందికి దేవాలయం వద్ద మహాఅన్నదాన కార్యక్రమం జరిగింది. చలు వాది ఫౌండేషన్ తరుపున ఏర్పాటు చేసిన ఉచిత మజ్జిగ, మంచినీటి పంపిణీ కేంద్రాన్ని గురజాల డీఎస్పీ పళ్లంరాజు ప్రారంభించి భక్తులకు అందజేశారు. ప్రముఖ వ్యాపారి కనిగిరి శ్రీనివాసరావు భక్తులకు అవసరమైన మంచినీటి బాటిల్స్ ప్యాకెట్లను వేలాదిగా అందించారు. ఆదేవిధంగా పట్టణ కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పానకం పంపిణీ చేశారు. రథోత్సవం స్వామివారి దేవాలయం నుండి ప్రారంభమై ప్రధాన రహదారి గుండా ఆంధ్రాబ్యాంక్ సెంటర్ వరకు కొనసాగి తిరిగి దేవాలయం వరకు నిర్వహించారు. రథోత్సవాన్ని పురస్కరించుకొని గురజాల డీఎస్పీ పళ్లంరాజు, పట్టణ సీఐ వీరాంజ నేయులు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకున్నారు. దేవాలయ కమిటీ అధ్యక్షులు కాకుమాను మల్లిఖార్జునరావు, ఆముదాల చినగంగాధరరావు, భవిరిశెట్టి శ్రీను, కాకుమాను గోపాల్‌రావుతో పాటు కోట హరినారాయణ, కొత్త రఘురామయ్య, కట్టమూరి శంకరరావు, పసుమర్తి సుబ్రహ్మణ్యం, జూలకంటి సుబ్రహ్మణ్యం, గుండా నారాయణ, కొమ్మినేని రామచంద్రరావు, విప్పర్ల నాగాచారి, తదితరులు సహాయ సహకారాలు అందజేశారు.



సీతారాముల కల్యాణ మహోత్సవంలో ఉపన్యసిస్తున్న చినజీయర్‌స్వామి



ఉదయం 7 గంటలకు పొగమంచుతో నిండిన వినుకొండ రైల్వేస్టేషన్

ఉదయం ఏడు గంటలైనా వీడని మంచు.. పగలు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

వినుకొండ టౌన్, జనవరి 28: తెల్లవారుజామున మంచు, పగలు ఎండలు పెరగడంతో ప్రజలు ఇబ్బందికర పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. జనవరి చివరి వారం నుంచి వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా ఎండలు ఇప్పుడిప్పుడే పెరుగుతున్న నేపథ్యంలో తెల్లవారుజామున పొగ మంచుతో రోడ్లపై ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదివారం ఉదయం 7గంటల సమయంలో పొగమంచు విపరీతంగా పెరగడంతో రైళ్ల రాకపోకలకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



రెడ్డిపాలెంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న అరవిందబాబు, గోనుగుంట్ల కోటేశ్వరరావు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ అరవిందబాబు

రొంపిచర్ల, జనవరి 28: రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ చదలవాడ అరవిందబాబు పేర్కొన్నారు. మండలంలోని రెడ్డిపాలెంలో టీడీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం ఆదివారం జరిగింది. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావుతో కలసి ఆయన ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. మేనిఫెస్టోలోని అంశాలను టీడీపీ ప్రభుత్వంలోకి రాగానే అమలు చేస్తామన్నారు. వైసీపీలో అనిశ్చితి నెలకొందని పేర్కొన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు తెలుగుదేశం పార్టీలో చేరుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని తెలుగుదేశం పార్టీ బలమైనదిగా తయారవుతుందని పేర్కొన్నారు. నరసరావుపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అభివృద్ధిని గాలికి వదిలి వేశారని తెలిపారు. బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమానికి విశేస స్పందన లభిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలు టీడీపీకి ఎప్పుడు ఓటు వేద్దామా అని ఎదురు చూస్తున్నారన్నారు. గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ నరసరావుపేట నియోజకవర్గంలో పదివేల మెజార్టీతో టీడీపీ గెలుస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రానికి చంద్రబాబు అవసరం ఉందని తెలిపారు.

కార్యక్రమంలో పార్టీ నేతలు పులుకూరి జగ్గయ్య, పల్లెల నాగిరెడ్డి, లింగా వెంకటేశ్వర్లు, మెట్టు వెంకటేశ్వరరెడ్డి, కొలికొండ కొండలు, కుమ్మెత కోటిరెడ్డి, వనిపెంట పిచ్చిరెడ్డి, గంగారపు సైదులురెడ్డి, అల్లటిపల్లి శ్రీనివాసులరెడ్డి, గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నాలుగు రోజుల పాటు విద్యుత్ టారిఫ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ

చిలకలూరిపేట, జనవరి 28: ఈ నెల 29వ తేదీ నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు నాలుగురోజుల పాటు ఏపీఈఆర్‌సీ వారి విద్యుత్ టారిఫ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్టు విద్యుత్ శాఖ ఈఈ చల్లా రమేష్ ఆదివారం ఇక్కడ తెలిపారు. యడ్లపాడు, నాదెండ్ల, చిలకలూరిపేట, పత్తిపాడు, బొకిపర్రు, ఫిరంగిపురం, వట్టిచెరుకూరు విద్యుత్ వినియోగదారులు ఆ రోజుల్లో ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల లోపు తమ అభిప్రాయాన్ని తెలియ జేయవచ్చునని పేర్కొన్నారు. విద్యుత్ శాఖ గుంటూరు సంగడిగుంట, రాయపూడి పర్యవేక్షక ఇంజనీరు వారి కార్యాలయంలో ఏపీసీపీడీసీఎల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని ఆయన వివరించారు. 2024-2025 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన డిస్కమ్ వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరలపై వినియోగదారుల వద్ద నుంచి అభిప్రాయాలు తీసుకోవటం జరుగుతుందన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విశాఖపట్నం నుంచి బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

టీచర్ల సమస్యలను పరిష్కరించాలి: ఎస్టీయూ

చిలకలూరిపేట, జనవరి 28: రాష్ట్రంలో ఉపాధ్యాయులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న అన్ని బకాయిలు వెంటనే చెల్లించాలని ఎస్టీయూ చిలకలూరిపేట ప్రాంతీయ శాఖల సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రజిత్ యాదవ్ ఆదివారం డిమాండ్ చేశారు. ఏరియా కార్యదర్శి వినుకొండ అక్కయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే మెగా డీఎస్సీ-2024 ప్రకటించి నిరుద్యోగ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. 12వ డీఆర్‌సీలో భాగంగా 30శాతం ఐఆర్ ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. మునిసిపల్ ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు నిర్వహించటానికి యూనిఫైడ్ సర్వీస్ రూల్స్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల ఉపాధ్యాయులకు కనీస వేతన చట్టం అమలు చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి కే కోటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి పోటు శ్రీనివాసరావు, ఎస్టీయూ నాయకులు ఏమండి, మేకల కోటేశ్వరరావు, జమీర్‌బాషా, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం అమ్ముతున్న మహిళ అరెస్టు

నాదెండ్ల, జనవరి 28: మండలంలోని కనపర్రులో అక్రమంగా ఎక్కువ ధరకు మద్యం అమ్ముతున్న ఉప్పుతోళ్ళ సరోజిని అనే మహిళను నాదెండ్ల పోలీసులు అరెస్టు చేశారు. ఆమె వద్ద నుంచి 16 బాటిళ్ళ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వివేకానంద పాఠశాల వార్షికోత్సవం



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న చిన్నారులు

వినుకొండ టౌన్, జనవరి 28: పట్టణంలోని వివేకానంద పాఠశాల 36వ వార్షికోత్సవాన్ని స్థానిక గంగినేని గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పల్నాడు జిల్లా ఉప విద్యాశాఖ అధికారి వేణుగోపాలరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే మంచి నడవడిక గల స్నేహితులను బట్టి వారి ప్రవర్తన భవిష్యత్ ఆధారపడి ఉంటుందని అన్నారు. వివేకానందుడు, మహాత్మాగాంధీ వంటి వారి జీవిత చరిత్రలు చదవడం ద్వారా యువత ఆలోచన విధానంలో మార్పులు వస్తాయని, మంచి పౌరులుగా ఎదుగుతారన్నారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సయ్యద్ రఫీ, అహ్మద్, ఎంఈవో జఫ్రుల్లా, సయ్యద్ ఆరిఫ్, అనూష, తదితరులు పాల్గొన్నారు.